నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 కరీంనగర్, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 KARIMNAGAR

## ఉత్తమ మహిళా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ మహిళలకు అందించే రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేసే ఈ అవార్డుల కోసం వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతూ, విశిష్ట సేవలందిస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 17న సాయంత్రం 5 గంటల్లోగా బాలరక్ష భవన్‌లో గల జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో అందజేయాలని, అన్ని పనిరోజుల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

## 14న డీసెట్ మూడో విడుత కౌన్సెలింగ్

తిమ్మాపూర్ రూరల్ ఫిబ్రవరి12: ఎల్‌ఎండీ కాలనీలో గల జిల్లా విద్యా శిక్షణ సంస్థలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 14న మూడో విడుత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య తెలిపారు. డీసెట్-2023లో ఉత్తీర్ణులై ఒరిజినల్ ధ్రువ పత్రాల పరిశీలన చేయించుకోని వారు ఎల్‌ఎండీ కాలనీలో లోని డైట్ కళాశాలలో కౌన్సిలింగ్ కు హాజరుకావాలని కోరారు. మరిన్నీ వివరాలకు డీ సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు .

## రామగుండం సీపీగా శ్రీనివాసులు


డాక్టర్ ఎం శ్రీనివాసులు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 12: రామగుండం కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ ఎం శ్రీనివాసులు నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 12మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసులు 2016-18 మధ్య కాలంలో ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొంది, సీఐడీ విభాగంలో పనిచేశారు. కాగా, ఇక్కడ మొన్నటిదాకా పనిచేసిన రెమో రాజేశ్వరి ఇటీవలే బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలోనే నూతన సీపీగా శ్రీనివాసులు వస్తున్నారు.

# చలో నల్లగొండ

## భారీ బహిరంగ సభకు సిద్ధమైన గులాబీ శ్రేణులు



- కృష్ణానదీ జలాలపై తెలంగాణ హక్కుల కోసం బీఆర్‌ఎస్ పోరుబాట
- నేడు నల్లగొండలో భారీ బహిరంగ సభ
- దిశానిర్దేశం చేయనున్న బీఆర్‌ఎస్ అధినేత
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇదే తొలి సభ కావడంతో సర్వత్రా ఆసక్తి
- ఉమ్మడి జిల్లా నుంచి తరలేందుకు సిద్ధమైన శ్రేణులు
- ఇప్పటికే సిద్ధం చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జీలు

**నాడు తెలంగాణ హక్కుల సాధనకు ఉద్యమించి.. స్వరాష్ట్రాన్ని సాధించిన బీఆర్‌ఎస్ పార్టీ, నేడు మరోసారి ప్రజల పక్షాన పోరుబాట పడుతున్నది. కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణ హక్కులను కేంద్రానికి ధారాదత్తం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 'చలో నల్లగొండ' పేరిట మంగళ వారం నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నది. కృష్ణా పరీవాహక ప్రాంత రైతులకు జరిగే అన్యాయాన్ని వివరించి.. రాష్ట్ర హక్కులను కాపాడుకునే లక్ష్యంతో ఈ సభ నిర్వహిస్తుండగా, ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో ఇన్‌చార్జీలు సన్నాహక సమావేశాలు నిర్వహించి, అంతా సిద్ధం చేశారు.**



కరీంనగర్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నాటి సమైక్య ప్రభుత్వ హయాంలోనూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జల హక్కుల కోసం ఉద్యమించారు. ప్రధానంగా ఆనాటి మహారాష్ట్ర ప్రభుత్వం శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడారు. నిజానికి ఉత్తర తెలంగాణకు వరప్రదాయని ఎస్సారెస్పీ. కానీ, ఈ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండా మహారాష్ట్ర ప్రభుత్వం ఎగువన బాబ్లీతోపాటు అనేక ప్రాజెక్టులను నిర్మించింది. ఆనాటి సమైక్య ప్రభుత్వాలు చూసీచూడనట్లుగా వ్యవహరించాయి. మహారాష్ట్ర ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులతో ఎస్సారెస్పీ ఉనికి ప్రశ్నార్థంగా మారుతుందని, తద్వారా ఉత్తర తెలంగాణ ఎడారి అవుతుందన్న ఉద్దేశంతో అప్పుడు బీఆర్‌ఎస్ అధ్వర్యంలో కేసీఆర్ పెద్ద ఉద్యమమే నడిపారు. వరుస ఆందోళన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా రాజీవ్‌రహదారిపై వంటావార్పుతోపాటు మహాధర్నాకు పిలుపునిచ్చారు. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా రాజీవ్‌రహదారిపై వంటా వార్పు నిర్వహించారు. ఇదొక్కటే కాదు, టీఆర్‌ఎస్ (నేటి బీఆర్‌ఎస్) ఏర్పడినప్పటి నుంచి మొదలు తెలంగాణకు సమైక్య రాష్ట్రంలో జరిగిన ప్రతి అన్యాయంపైనా పోరు సల్పారు. ఇవే కాదు, నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా ఉద్యమం నడిపి చివరకు తెలంగాణ రాష్ట్రం సాధించారు. సాధించిన రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే విషయంలో కేసీఆర్ పలు సందర్భాల్లో కేంద్రాన్ని వ్యతిరేకించారే తప్ప, ఏనాడూ తెలంగాణ హక్కులను కేంద్రం వశం చేయలేదు.


నల్లగొండ సభకు సిద్ధమైన వేదిక

### నేడు కృష్ణా జలాల కోసం..

ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాలపై ఉన్న హక్కులను కేంద్రానికి ధారాదత్తం చేసిన వైఖరిని నిరసిస్తూ.. మరోసారి కేసీఆర్ ఉద్యమ బాట పడుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల విషయంలో అనుసరించిన తీరుతో దక్షిణ తెలంగాణలోని మెజార్టీ జిల్లాలపై.. ప్రధానంగా కృష్ణా నదీ పరివాహక ప్రాంతంపై ప్రభావం పడుతుంది. ఈ విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరును బీఆర్‌ఎస్ ఎండగడుతూనే ఉన్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెత్తు పోకడను ప్రదర్శిస్తున్నది. జరిగిన తప్పును ఒప్పుకోకుండా.. ఆ బద్నాంను బీఆర్‌ఎస్‌పై వేసేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నది. ఈ నేపథ్యంలో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ)కి కాంగ్రెస్ ప్రభుత్వం ధారాదత్తం చేసిన హక్కుల ద్వారా కృష్ణా పరీవాహక ప్రాంత రైతులకు జరిగే అన్యాయాన్ని వివరించి.. వారిని చైతన్యవంతులను చేసే లక్ష్యంతో అధినేత కేసీఆర్ నేడు నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ సభను ప్రారంభించనున్నారు.

### తరలివెళ్లనున్న గులాబీ శ్రేణులు

నల్లగొండ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యర్తలు తరలి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. కేసీఆర్ చేస్తున్న పోరుబాటకు సంఘీభావం ప్రకటించేందుకు పెద్ద సంఖ్యలో వెళ్లాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా జరుగుతున్న భారీ బహిరంగ సభ కావడం.. ఇదే సమయంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతుండడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి వందలాదిగా తరలి వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. 'చలో నల్గొండ' పేరిట బహిరంగ సభకు తరలివెళ్లాలని నిర్ణయించారు. అందుకోసం కావాల్సిన ఏర్పాట్లను సైతం చేశారు.

## చిట్టి హృదయాన్ని ఆదుకోరూ..

### ప్రాణాపాయస్థితిలో నాలుగు నెలల చిన్నారి
### పుట్టుకతోనే గుండెనాళాల్లో సమస్య


చిన్నారి ధన్విక

- రూ.4లక్షలతో ఆపరేషన్.. మళ్లీ కొద్దిరోజులకే హోల్ ఉన్నట్టు నిర్ధారణ
- వైద్యానికి మరో రూ.8లక్షలు
- తమ పాపను బతికించాలని తల్లిదండ్రుల వేడుకోలు

*రోజూ కూలీ పనిచేస్తేనే పూట గడిచే ఓ కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చిపడింది. తొలిసూరు బిడ్డ గుండె సంబంధిత సమస్యలతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా, తల్లడిల్లిపోతున్నది. పుట్టుకతోనే రక్తనాళాలు మూసుకుపోవడంతో ₹4లక్షలు అప్పుచేసి వైద్యం చేయించిన తల్లిదండ్రులకు అంతలోనే మళ్లీ పిడుగులాంటి వార్త వినిపించింది. అంతా బాగానే ఉందనుకున్న టైంలో చిన్నారి హార్ట్‌లో హోల్ ఉందని, చికిత్సకు మరో ₹8లక్షలు అవుతుందని వైద్యులు చెప్పడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. తమ పాపను బతికించాలని వేడుకుంటున్నారు.*

కొడిమ్యాల, ఫిబ్రవరి 12: కొడిమ్యాలకు చెందిన చిలువేరి నరేశ్, శరణ్యది పేద కుటుంబం. రోజూ పనిచేస్తేనే పూట గడుస్తుంది. వీరికి రెండేండ్ల క్రితమే వివాహమైంది. అయితే నాలుగు నెలల క్రితం శరణ్యకు మొదటికాన్పులో ఆడ శిశువు ధన్విక జన్మనిచ్చింది. అయితే ఆమె శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్ దవాఖానకు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని రెన్‌బో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గుండెకు సంబంధించిన రక్తనాళాలు మూసుకుపోయి బ్లడ్ సరఫరా సరిగ్గా కావడం లేదని, ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు ₹4లక్షల దాకా అప్పు చేసి ఆపరేషన్ చేయించారు. అంతా బాగుందని అనుకున్న సమయంలో చిన్నారికి జనరల్ పరీక్షలు చేయించగా, గుండెకు హోల్ ఉందని తేలడంతో ఆందోళన చెం దారు. ఈ నెలలోనే ఆపరేషన్ చేయించాలని, అందుకు మ రో ₹8లక్షల దాకా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఇప్పు డు అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలని తల్లడిల్లుతున్నారు. దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సాయం చేయాలనుకునే వారు నరేశ్ 8143203264కు ఫోన్ పే లేదా గూగుల్ పే చేయాలని, లేదా యూనియన్ బ్యాంక్ కొడిమ్యాల బ్రాంచ్ (అకౌంట్ నంబర్ 080410100027341 - ఐఎఫ్‌ఎస్‌సీకోడ్ యూబీఐఎన్0808041) కు డబ్బులు పంపాలని కోరుతున్నారు.

## నేత్రపర్వంగా మార్కండేయ జయంతి


శోభాయాత్రలో పాల్గొన్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, పద్మశాలీ సంఘం నాయకులు


శోభాయాత్రలో భాగంగా రథంపై స్వామివారి ఊరేగింపు

సిరిసిల్ల పట్టణంలో శివభక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా, సాయంత్రం ఆలయం నుంచి పురవీధులగుండా నిర్వహించిన స్వామివారి శోభాయాత్ర కనులపండువగా సాగింది. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్థానిక పాత బస్టాండ్‌లో నేతన్న విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. జై మార్కండేయ నినాదాలతో పట్టణం మార్మోగింది. వేడుకల్లో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, పద్మశాలీ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కామునివనిత, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్ పాల్గొన్నారు.

**- సిరిసిల్ల/సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 12**

## కొనసాగుతున్న బదిలీలు


### ఈసారి జడ్పీ సీఈఓలు, డీఆర్‌డీవోలు, డీపీవోలు

కరీంనగర్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టింది. ఇప్పటికే పలు శాఖల్లో బదిలీలు జరగగా, ఇప్పుడు జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీవోలు, డీపీవోలను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొందరు అధికారులకు ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీలు కాగా, మరి కొందరిని ఇతర జిల్లాలకు పంపించారు. కరీంనగర్ డీఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎల్ శ్రీలతారెడ్డిని రంగారెడ్డికి, పెద్దపల్లి డీఆర్‌డీఓగా పనిచేస్తున్న వీ శ్రీధర్‌ను కరీంనగర్‌కు బదిలీ చేశారు. కాగా, ఆదిలాబాద్ జడ్పీలో డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న ఆర్ రాజేశ్వర్‌ను పెద్దపల్లి డీఆర్‌డీఓగా బదిలీ చేశారు. జగిత్యాల డీఆర్‌డీఓగా పనిచేస్తున్న పీ నరేశ్‌ను జయశంకర్ భూపాలపల్లికి, వరంగల్ డీఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎం సంపత్‌రావును జగిత్యాలకు బదిలీ చేశారు. సిరిసిల్లలో డీఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎన్ శ్రీనివాస్‌ను మాతృ సంస్థ అయిన రెవెన్యూ శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఇతని స్థానంలో మంచిర్యాల డీఆర్‌డీఓ బీ శేషాద్రిని బదిలీ చేశారు. సిరిసిల్లలో అదనపు డీఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎంపీడీఓ సీహెచ్ మదన్‌మోహన్‌ను జగిత్యాల అదనపు డీఆర్‌డీఓగా బదిలీ చేశారు. కరీంనగర్ జడ్పీ సీఈఓగా పనిచేస్తున్న డిప్యూటీ సీఈఓ టీ పవన్ కుమార్ వరంగల్ డిప్యూటీ సీఈఓగా, పెద్దపల్లి జడ్పీ సీఈఓగా పనిచేస్తున్న ఎం శ్రీనివాస్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. మంచిర్యాల జడ్పీ సీఈఓగా పనిచేస్తున్న కే నరేందర్‌ను పెద్దపల్లికి బదిలీ చేశారు. సిరిసిల్ల జడ్పీ సీఈఓగా పనిచేస్తున్న బీ గౌతంరెడ్డిని జగిత్యాలకు, సిరిసిల్ల జడ్పీ సీఈఓగా హైదరాబాద్‌లోని టీఎస్‌ఐఆర్‌డీ జేడీగా పనిచేస్తున్న ఎం ఉమారాణికి పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్ డీపీఓ వీర బుచ్చయ్యను సిరిసిల్లకు, సిరిసిల్ల డీపీఓ ఎనగందుల రవీందర్‌ను కరీంనగర్‌కు బదిలీ చేశారు. పెద్దపల్లి డీపీఓ వీ చంద్రమౌళిని భద్రాద్రి కొత్తగూడెంకు, భూపాలపల్లి డీపీఓ లతను పెద్దపల్లికి బదిలీ చేశారు. ఎక్సైజ్ శాఖలో శంషాబాద్ డీపీఈఓగా పనిచేస్తున్న ఏ సత్యనారాయణరావును జగిత్యాలకు, కరీంనగర్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఏ విజయ భాస్కర్‌రెడ్డిని మహబూబ్‌నగర్‌కు, హైదరాబాద్‌లో బ్రేవరేజెస్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కే వరప్రసాద్‌ను కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు.


క్యూలైన్లో దర్శనంకోసం నిలబడ్డ భక్తులు

## రాజన్న సన్నిధికి లక్షమంది

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 12: సమ్మక్క జాతరకు ముందు తొలిమొక్కు కోసం తరలివచ్చిన భక్తులతో సోమవారం వేములవాడ రాజన్న ఆలయం పోటెత్తింది. సుమారు లక్ష మంది రావడంతో ప్రాంగణం జాతరను తలపించింది. క్షేత్రానికి వచ్చే దారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. రాష్ట్ర నలుమూలల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రాయేశుడికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కును చెల్లించుకున్నారు. ఎత్తు బంగారం (బెల్లం) జోకించి పంచిపెట్టారు. సుమారు లక్ష మంది స్వామివారిని దర్శించుకోగా సుమారు రూ. 34 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు. సర్వ దర్శనానికి సుమారు 4 గంటలకు పైగా పట్టిందని పేర్కొన్నారు.


గోదావరిఖని ప్రభుత్వ దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

## సస్పెన్షన్‌ను ఖండిస్తూ వైద్యుల నిరసన

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 12: కామారెడ్డి జనరల్ దవాఖానలో ఐసీయూలో ఉన్న పేషెంట్‌ని ఎలుకలు కొరికిన ఘటనలో వైద్యులను బాధ్యులను చేసి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ దవాఖాన ఎదుట తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దవాఖానలో శానిటైజేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు వైద్యుడికి ఎలాంటి సంబంధం లేనప్పటికీ సస్పెండ్ చేయడం దారుణమన్నారు. వెంటనే సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో బోధన సంఘం గోదావరిఖని శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శిరీష, కోశాధికారి డాక్టర్ ఫరీద్, ఉపాధ్యక్షులు డాక్టర్ అనూష, రవివర్మ, వైద్యులు శ్రీధర్, అఖిల్ పాల్గొన్నారు.

## దివ్యాంగ పిల్లలకు అండగా ఉంటాం

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి


విద్యార్థులకు బెడ్స్ అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12: దివ్యాంగ పిల్లలకు అండగా ఉంటామని కలెక్టర్ పమేలా సత్పతి భరోసానిచ్చారు. తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలోని మానసిక దివ్యాంగుల పాఠశాలను సోమవారం సాయంత్రం ఆమె సందర్శించారు. విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకున్నా రు. విద్యార్థులకు తగ్గట్టుగా విద్యనందిస్తున్న టీచర్లు, సిబ్బందిని అభినందించారు. అలాగే, వారధి సంస్థ ద్వారా ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.6లక్షల విలువైన 120 బెడ్స్ అందజేశారు. గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న ఇద్దరు అభ్యర్థులకు రూ.18 వేల విలువైన పుస్తకాలు పంపిణీ చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ, వారధి సొసైటీ ద్వారా సామాజిక కార్యక్రమాల కోసం రూ. కోటిన్నర మంజూరు చేసినట్లు చెప్పారు. ఉద్యోగార్థుల కోసం ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి, మాజీ చైర్మన్ గొట్ట భూపతి, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, వారధి సొసైటీ కోఆర్డినేటర్ ఆంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.